నిత్యావసర వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి - గండేపల్లి

సరుకులు అందిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

సూరంపాలెం, ఆదిత్య కాలేజీ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రంగంపేట మండలం ఈలకొలను గ్రామంలో పేదలకు రూ.10 వేల విలువ చేసే నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్, ఎజ్జు సతీష్‌కుమార్, ఎజ్జు సత్య సుబ్రహ్మణ్యం, కొనే చక్రవర్తి, కడిమి కేశవ నారాయణ, ద్వారంపూడి మణికంఠచక్రవర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ప్రశాంతి, రేణుక, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

ప్రయివేటు ఫీ'జులుం'

- జూన్12 నుంచి పున:ప్రారంభం
- వసూళ్లకు సిద్ధమైన యాజమాన్యాలు
- ఏటా ఇదే తంతు..పట్టని అధికారులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

జిఒ నెంబరు 53 ప్రకారం 1 నుంచి 10 తరగతి వరకూ చదువుతున్న పిల్లలకు రూరల్ ఏరియాలో రూ.10 వేలు, పట్టణాల్లో 15 వేలు, నగరాల్లో 20 వేలు ఫీజులు వసూలు చేయాలని గతేడాది ప్రభుత్వం చెప్పింది. అయితే ప్రయివేటు యాజమాన్యాలు కోర్టుని ఆశ్రయించి సంబంధిత జిఒను రద్దు చేయించాయి. దీంతో తమ ఇష్టారాజ్యంగా ఫీజులతో బాటు బస్సు ఛార్జీలు, పుస్తకాలు ఇలా రకరకాలుగా ఏడాదికి రూ. వేలల్లో, కొన్ని స్కూళ్లలో లక్షల్లో వసూలు చేసుకుని జేబులు నింపుకొంటున్నాయి. అయినా విద్యా శాఖ అధికారులు మాత్రం తమకు ఏమీ సంబంధం లేదు అన్నట్లుగా వ్యవహరిస్తుండడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వచ్చే నెల 12 నుంచి పాఠశాలన్నీ పున:ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అధిక ఫీజుల వసూళ్లకు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఈ ఏడాది కూడా సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే పలు సంస్థలు అడ్మిషన్లు వేటలో నిమగ్నమయ్యాయి. అడ్డు అదుపు లేకుండా అధిక మొత్తంలో కలెక్షన్లు చేస్తున్నాయి. ఏటా ఇదే తంతు కొనసాగిస్తున్నా పట్టించుకోని అధికారుల తీరుపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 1800 వరకూ ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. వీటిల్లో దాదాపు 3.50 లక్షల మంది ఏటా చదువుతున్నారు.

ఫీజులపై నియంత్రణ ఉండాలి

ప్రభుత్వ ఆధీనంలో ఉండవలసిన విద్యని నయా ఉదారవాద విధానాల ఫలితంగా విద్యారంగాన్ని ప్రయివేటు, కార్పొరేట్ కబంధ హస్తాల్లో నలిగిపోతోంది. ప్రయివేట్, కార్పొరేటర్ సంస్థ ఫీజులపై కనీసం ప్రభుత్వం నియంత్రణ కూడా చేయడం లేదు. గతంలో తీసుకువచ్చిన జిఒ నెంబర్ 53 ప్రకారం ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు గ్రామీణ, పట్టణ, నగరంలో ఎంత ఫీజు వసూలు చేయాలనేది ఉండేది. అయితే జిఒ ఇచ్చినప్పటికీ ఆ జిఒని అమలు చేయడంలోనూ..కాపాడడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. తల్లిదండ్రుల రక్తాన్ని తాగేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి. రూ. వేలల్లో వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలి.

- ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కాకినాడ

నియంత్రణ లేని ఫీజులు

పలు విద్యాసంస్థల్లో నియంత్రణ లేని ఫీజులను వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లే స్కూల్, నర్సరీ, ఎల్‌కేజిలకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు, 1 నుంచి 5 వరకూ రూ.15 వేల నుంచి రూ.35 వేలు, 6 నుంచి 10 వరకూ రూ.30 వేలు నుంచి లక్ష వరకూ కూడా వసూలు చేసే కార్పొరేట్ పాఠశాలలున్నాయి. అలాగే బస్సు, యూనిఫామ్, పుస్తకాలు ఇలా రకరకాల పేర్లతో ఫీజులు కలెక్షన్ జరుగుతుంది. ఫీజుల విషయంలో నిబంధనలు పాటించడం లేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదంటూ విద్యాశాఖ అధికారులపై మండిపడుతున్నారు. 1994లో వచ్చిన జిఒ నెంబర్ 1 ప్రకారం ప్రయివేటు పాఠశాల ప్రిన్సిపల్, విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఇద్దరితో ఒక కమిటీని నియమించాలి. వసూలు చేసిన ఫీజులో ఐదు శాతం యాజమాన్యం, మిగిలిన మొత్తం పాఠశాల అభివృద్ధి, ఉద్యోగుల, సిబ్బంది వేతనాలు, వారికి బీమా, పాఠశాల నిర్వహణకు వ్యయం చేయాలి. 2008లో విడుదల చేసిన 90, 91, 92 జిఒల ప్రకారం జిల్లా విద్యాశాఖ అధికారి, ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ప్రయివేటు విద్యాసంస్థల ప్రతినిధులతో ఒక కమిటీని జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో నియమించాలి. అయితే జిల్లాలో ఇవి ఎక్కడా అమలు కావడం లేదు.

కానరాని సౌకర్యాలు

పలు విద్యాసంస్థలు అపార్టుమెంట్లు, రేకుల షెడ్లలో తరగతులను నిర్వహిస్తున్నాయి. గాలి, వెలుతురు వచ్చే విశాలమైన తరగతి గదులు ఎక్కడా కానరావు. ఉపాధ్యాయులకు అర్హతలతో పని లేకుండా ఎవరు ఎక్కువ విద్యార్థుల్ని పాఠశాలల్లో చేర్పిస్తే వారికే ఎక్కువ జీతాలు ఇస్తారు. జిల్లాలో పలు విద్యాసంస్థలకు ప్రాథమిక పాఠశాల వరకు అనుమతులుంటాయి. అయితే హైస్కూల్ స్థాయిలో బోధన ఉంటుంది. ఇక ప్రీ స్కూల్, టెక్నో, ఈ-టెక్నో, ఐఐటీ, ఒలంపియాడ్ తదితర తోకలను పాఠశాల పేర్లకు ముందో వెనకో తగిలించి రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు.

నేతల అడ్డుకట్ట

గుర్తింపు లేదని, వసతులు సక్రమంగా లేవని ఒకవేళ అధికారులు పాఠశాలలపై చర్యలకు ఉపక్రమిస్తుంటే రాజకీయ నాయకుల ప్రోద్భలంతో తిరిగి పాఠశాలల్ని తెరుస్తున్నారు. దీంతో అధిక ఫీజుల వసూళ్లు, పుస్తకాలు, దుస్తులు తప్పనిసరిగా కొనాల్సిందే అనే నిబంధనలపై తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి పాఠశాలలో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలి. కానీ ఇది జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలు చేస్తూ సౌకర్యాలు లేకున్నా, పాఠశాలల యజమానులు నిబంధనలు పాటించకున్నా అన్నీ ఉన్నట్టే అనుమతులు మంజూరు చేస్తున్నారు.

చెరువు వద్ద మూతపడిన ఆర్వో ప్లాంట్

మూత పడిన మున్సిపల్ ఆర్ఒ ప్లాంట్లు

- ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు
- తక్షణమే తెరిపించాలని డిమాండ్

ప్రజాశక్తి - సామర్లకోట

అసలే మండువేసవి, ముదురుతున్న ఎండలతో ప్రజలు గొగ్గోలు పడుతున్నారు. మరోవైపు తాగునీటి కోసం ప్రజలు ఆర్ఒ ప్లాంట్లు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సామర్లకోట మున్సిపాలిటీలో పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి ప్లాంట్ మూత పడింది. ప్లాంట్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది నిర్లక్ష్య ధోరణిని అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పట్టణ ప్రజలు ప్రయివేట్ ప్లాంటులను ఆశ్రయించి చేతి చమురును వదిలించుకుంటున్నారు. పట్టణ ప్రజలకు రూ. 2లకే 20 లీటర్ల ఫిల్టర్ వాటర్ అందించేందుకు లక్షలు వ్యయంతో మున్సిపాలిటీ పరిధిలో పోలీస్ స్టేషన్ సమీపంలో, బ్రౌన్ పేట డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పార్క్‌లోను, గణపతి నగరం వాటర్ ట్యాంక్‌ల వద్ద ఆర్ఒ ప్లాంట్‌లను దాతల సహకారంతో లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేశారు. అయితే బ్రౌన్ పేటలో ప్లాంటును నామమాత్రంగా ఏర్పాటు చేసి వదిలి పెట్టడంతో అది నిరూపయోగంగా మారింది. మిగిలిన రెండు యూనిట్ల విషయానికొస్తే వాటి నిర్వహణకు మున్సిపల్ వాటర్ వర్క్స్ శాఖకు చెందిన సిబ్బందిని ఏర్పాటు చేశారు. అయితే వారు ప్లాంటులను తెరిచే విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అవి మూతపడుతున్నాయి. దీంతో ప్రజలు తాగునీరు విషయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలు ప్రత్యామ్నా యం కోసం మున్సిపాలిటీ ద్వారా అందించే ఆర్ఒ ప్లాంటుల వద్దకు వెళ్ళగా అవి మూతపడి ఉండటంతో తాగునీరు దొరకక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఈ మధ్య కాలంలో పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్లాంట్ పూర్తిగా మూతపడి ఉంటుందని ఏమని అడిగితే సిబ్బంది ప్రజలతో ఘర్షణకు దిగుతున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. కాగా ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో ప్రయివేట్ ప్లాంటులను ఆశ్రయించి తాగునీరు కొని తాగాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేట్ ప్లాంటుల యజమానులను ప్రోత్సహిం చేందుకు ఈ విధంగా మున్సిపల్ సిబ్బంది మున్సిపల్ ఆర్ఒ ప్లాంటులను మూసి వేస్తున్నారనే ఆరోపణలు పట్టణంలో విన్పిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మున్సిపల్ ఆర్ఒ ప్లాంటులను తెరిపించి వాటిద్వారా రక్షిత ఫిల్టర్ జలాలు తక్కువ ధరకు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్ వివరణ

ఈ విషయమే 'ప్రజాశక్తి' మున్సిపల్ కమిషనర్ జె.రామారావు వివరణ కోరగా నిన్నటి వరకు ఎన్నికల విధుల్లో ఉండిపోయామని, వాటర్ సప్లై సిబ్బందితో సమీక్షించి ఆర్ఒ ప్లాంట్లు సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపడతామని చెప్పారు.

మీడియాతో మాట్లాడుతున్న ఆర్ఒ

సమిష్టి కృషితో ప్రశాంతంగా పోలింగ్

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో పోలింగ్ సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటర్ల సమిష్టి కృషితో ప్రశాం తంగా పోలింగ్ జరిగిందని రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నా రు. బుధవారం డివిజనల్ రెవెన్యూ కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కూడా ఎటువంటి సమస్యలు తలెత్తలేదన్నారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 2,15,095 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,78,993 మంది 82.29 శాతం ఓటు హక్కును వినియో గించుకున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా ఉలిమేశ్వరంలో 95.19 శాతం, అత్యల్పంగా పెద్దాపురం పట్టణంలోని లూథ రన్ హైస్కూల్లోని 84వ పోలింగ్ బూత్‌లో 54.38 శాతం పోలింగ్ నమోదయిం దన్నారు. ఇవిఎం లన్నీ కాకినాడ జెఎన్ టియు కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్ర పరిచి షిఫ్టుల వారి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు కృషి చేసిన ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులకు అభినందనలు తెలిపారు.

అన్నదాతకు ఆరాధ్యుడు కాటన్ దొర

అపరభగీరథుడుగా కీర్తింపపడుతున్న సర్ ఆర్థర్ కాటన్ జయంతిని జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. గోదావరి ఉన్నంత వరకూ గోదావరి జిల్లా ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా కాటన్ ఉంటారని కొనియాడారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడలో..

జెఎన్‌టియుకె ప్రాంగణంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్, కాకినాడ లోకల్ సెంటర్ భవనంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెఎన్‌టియుకె ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కాకినాడ లోకల్ సెంటర్ మరియు రిటైర్డ్ ఇరిగేషన్ ఇంజనీర్స్ అసోసియేషన్ (ఆరఇఎకె)ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎల్.సుమలత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కాకినాడ లోకల్ సెంటర్ ఛైర్మన్, స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుమలత మాట్లాడుతూ భావి ఇంజనీర్లు సర్ ఆర్థర్ కాటన్‌ను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ధవళేశ్వరం వద్ద ఆర్థర్ కాటన్ నిర్మించిన బ్యారేజీ వలన గోదావరి జిల్లాలు సస్యశ్యామలం అయ్యాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలోనే ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టడం ముదావహమన్నారు. రిటైర్డ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎన్. అర్జునరావు మాట్లాడుతూ కాటన్ దార్శనికతను, సేవా తత్పరతను ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కాకినాడ లోకల్ సెంటర్ సెక్రటరీ డాక్టర్ వి.జయప్రసాద్ కార్యక్రమానికి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కాకినాడ లోకల్ సెంటర్ సెక్రటరీ డాక్టర్ వి.జయప్రసాద్, ఆర్ఇఎకె ప్రెసిడెంట్ ఇంజనీర్ ఎన్.కృష్ణారావు, సెక్రటరీ ఇంజనీర్ వి.కృష్ణారావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్‌లో..

బ్రిటిష్ పాలకుడైన కాటన్ మహాశయుడు అన్నదాతకు ఆరోగ్యంగా గుర్తింపబడ్డారని ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.శ్రీ నగేష్ అన్నారు. బుధవారం బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో కాటన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1803 మే 15న కాటన్ జన్మించారని అన్నారు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను దక్షిణ ప్రాంతానికి కాలువల శాఖకు ఇంజనీరుగా నియమించిందని గుర్తు చేశారు. 19వ శతాబ్దంలో గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి ఎన్నో లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించారని కొనియాడారు. అందుకే ఆయనను ఇప్పటికీ అపర భగీరథుడిగా డెల్టా వాసులు కీర్తిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రైతులు

గండేపల్లిలో..

మండలంలోని సూరం పాలెం ఆదిత్య యూని వర్సిటీ క్యాంపస్‌లో సర్ ఆర్థర్ కాటన్ 221వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రొఫెసర్, ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కల కరవుతో డెల్టావాసులు పొట్టచేత పట్టుకుని వలసలు పోయే పరిస్థితుల్లో.. బీడు భూములను బంగారం పండే మాగాణులుగా మార్చిన మాంత్రికుడు కాటన్ అని కొనియాడారు. నీటితో నేలరాతను మార్చి అన్నదాతగా మారిన అపర భగీరథుడుగా కాటన్ నిలిచారని అన్నారు. ధవళేశ్వరంలో ఆనకట్ట నిర్మించి ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్ గోదావరి జిల్లాల వాసులకు నిత్య స్మరణీయుడని అన్నారు. తెలుగు జాతితో నిత్యం పూజలందుకుంటున్న మహనీయుల్లో తొలి వరసలో కాటన్ ఉన్నారని అన్నారు. గోదావరి ఉన్నంతవరకూ గోదావరి జిల్లా వాసుల హృదయాలలో కాటన్ నిలిచిపోతారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ వి.సత్యనారాయణ, ప్రొఫెసర్ డాక్టర్ టి.నరేంద్రుడు, గ్రంథాలయ విభాగాధిపతి కె.అశోక్‌కుమార్, తోటకూర గంగాధర్, బల్లా సూర్యారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోటలో..

గోదావరి జిల్లాలను అన్నపూర్ణగా మార్చిన అన్నదాతగా పేరుగాంచిన సర్ ఆర్థర్ కాటన్ జయంతి కార్యక్రమం సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గోదావరి కాలువను ఆనుకుని ఉన్న కాటన్ దొర విగ్రహానికి రైతు సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి రూ.10 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించి ఈ ప్రాంతాలను సస్యశ్యామలం చేసిన గొప్ప దార్శనికులని కాటన్ ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతు నాయకులు పాల్గొని కాటన్‌కు ఘనంగా నివాళి అర్పించారు.

జెఎన్‌టియుకెలో కాటన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

తాళ్లరేవులో..

ఉభయగోదావరి జిల్లాల ఆశాజ్యోతి సర్ ఆర్థర్ కాటన్ జయంతి కార్యక్రమం పి.మల్లవరం, పత్తిగొంది పంట కాలువ వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజుబాబు, టేకుమూడి ఈశ్వరరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఉభయ గోదావరి జిల్లాలు సస్యశ్యామలం కావడానికి కాటన్ దొర బ్రిటిష్ వారిని ఒప్పించి ధవలేశ్వరం వద్ద ఆనకట్ట కట్టించడం వల్ల ఉభయగోదావరి జిల్లాలు అన్నపూర్ణగా మారాయని అన్నారు. ఇక్కడ పండిన పంటలు దేశంలో ప్రజలకే కాకుండా ఇతర దేశాల ప్రజలకు ఆహార ధాన్యాలు ఎగుమతి అవుతున్నాయని అన్నారు. ఉభయ గోదావరి జిల్లాలో ప్రజలకు తిండిగింజలతోపాటు ఆహార ఉత్పత్తులు, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులే కాకుండా పారిశ్రామిక రంగం అభివృద్ధి జరిగిందన్నారు. నిరంతరం కాటన్ మహాశయుని స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దున్న గంగరాజు, దుప్పి అదృష్టదీపుడు, తాతపూడి రాజారత్నం, ఎలిపే నాగేశ్వరావు, నల్లి ఈశ్వరరావు, కుంచె భీమాజీ, కొండమూరు శివయ్య, కుంచె అప్పన్న పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



'రాష్ట్రంలో కూటమి విజయం ఖాయం'

ప్రజాశక్తి - కాకినాడ రూరల్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి సత్యనారాయణ మూర్తి

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి విజయం ఖాయమని టిడిపి కాకినాడ రూరల్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి అన్నారు. బుధవారం వలసపాకలులోని వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రూరల్ నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి పంతం నానాజీ, కాకినాడ పార్లమెంటు అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లు అత్యధిక మెజారిటీతో విజయం సాధించ బోతున్నారని అన్నారు. తద్వారా రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని, ముఖ్యంగా దౌర్జన్యాలు, దోపిడీ, అరాచకం, అన్యాయం, అక్రమాలతో విసిగి వేసారిన అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొత్తు ధర్మానికి నిదర్శనం 'పిల్లి' దంపతులు

పొత్తు ధర్మానికి నిదర్శనంగా పిల్లి దంపతులు చరిత్రలో నిలిచిపోతారని కూటమి నాయకులు అన్నారు. కాకినాడ రూరల్, కరప మండలానికి చెందిన పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు వలసపాకలలోని మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంత లక్ష్మి, టిడిపి కాకినాడ రూరల్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో చోటు చేసుకున్న విషయాలను వారితో చర్చించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు జనసేన అభ్యర్థి పంతం నానాజీకి సీటు కేటాయించినప్పటి నుంచి పోలింగ్ రోజు వరకూ పిల్లి దంపతులు కృషి అభినందనీయమని అన్నారు. సమిష్టి కృషితోనే కూటమి అభ్యర్థి పంతం నానాజీ అత్యధిక మెజారిటీతో విజయం సాధించబోతున్నారని అన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్ఒ వెంకటరావు

స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించిన ఆర్ఒ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు బుధవారం ఇవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించారు. జెఎన్‌టియుకె సివిల్ బ్లాక్ ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీ లించి ఇతర అంశాలపై ఎన్నికల అధికారులతో చర్చించారు. ప్రస్తుత ఎన్నికలలో ఓటర్లు పెద్దఎత్తున ఓటు హక్కు వినియో గించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారని ఆర్ఒ వెంకటరావు అన్నారు. సిటీలో 72.07 శాతం ఓటు హక్కు వినియోగించుకు న్నారన్నారు. 2016 ఎన్నికలతో పోలిస్తే ఈసారి సుమారు 6 శాతం ఓటింగ్ శాతం పెరిగిందని చెప్పారు. యువకులు, మహి ళలు, వృద్ధులు చైతన్యవంతులై పెద్దఎత్తున తరలివచ్చి ఓట్లు వేశారన్నారు. ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం సహకరించిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ పర్యటనలో ఎఆర్ఒ చల్లన్నదొర పాల్గొన్నారు.

'అందరి అభిమానమే పవన్‌కు విజయం'

ప్రజాశక్తి - పిఠాపురం

కృతజ్ఞతా సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

ప్రజలందరీ ప్రేమాభిమానాలే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు విజయాన్ని అందిస్తాయని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు అన్నారు. బుధవారం గొల్లప్రోలు పట్టణంలో సత్య కృష్ణ ఫంక్షన్ హాల్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో కృతజ్ఞత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసైనికులు వేసుకున్న ఎర్ర తువ్వాలను చూసి వైసిపి వాళ్లు ఎందుకంత హడావుడి చేశారో అర్థం కాలేదన్నారు. ఎలక్షన్ జరుగుతున్న సమయంలో తనకు ఫోన్‌లో మీ పార్టీ కార్యకర్తలు కండువాలు వేసుకుంటున్నారని చెప్పడంతో కండువాలు తొలగించాలని ఎన్నికల నిబంధనలు పాటించాలని జనసైనికులకు తెలిపారన్నారు. తీరా చూస్తే వారు ధరించింది పార్టీ కండువాలు కాదని ఎర్ర తువ్వాలు అని అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి జనసైనికులు చాలా నిబద్ధతగా కష్టపడి నిజాయితీగా పని చేశారన్నారు. మీ అందరి అభిమానం, ప్రేమ పవన్ కళ్యాణ్‌ని గెలిపిస్తాయన్నారు. జనసైనికులు, వీర మహిళలు, నాయకులు ప్రత్యర్థి పార్టీ వారిపై ఎటువంటి ధూషానలకు దిగవద్దన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిప్రసాద్, నాయకులు మర్రెడ్డి శ్రీనివాసరావు, పంచకర్ల సందీప్, అజయ్, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసు

ప్రజాశక్తి – రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని పాతకోట గ్రామంలో విద్యుత్ చౌర్యం జరుగుతోందని సమాచారంతో విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు చేశారు. దీనిపై రెండు మోటార్లకు అనధికారకంగా విద్యుత్ స్తంభం నుంచి విద్యుత్ వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీనికి కారణంపై కేసు నమోదు చేసినట్లు అధికారులు వివరించారు. విజిలెన్స్ అధికారులు డిఇఇ ఎల్.నరేష్ నాయక్, ఎఇ డిఎస్. మురళి, కానిస్టేబుల్ టిజి.నారాయణ దాడుల్లో పాల్గొన్నారు. విద్యుత్ చౌర్యం చేసిన వారికి కోర్టు ఆదేశాలతో జరిమానా విధిస్తారని అధికారులు తెలిపారు.

తాళ్లరేవులో 85.89 శాతం పోలింగ్

ప్రజాశక్తి – తాళ్లరేవు

ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గంలో పరిధిలోని తాళ్లరేవు మండలంలో ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో 85.89 శాతం నమోదు అయ్యింది. మండలంలో 66,925 మంది ఓటర్లు గాను 58,239 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 88.72 శాతంఓటు హక్కు వినియోగించుకోగా, మహిళలు 85.35 శాతం మంది ఓటు వేశారు. 2024 ఎన్నికల్లో ఎన్నడూ లేనివిధంగా 3.37 శాతం మంది పురుషులు అధికంగా ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం.

ఉమ్మడి కుటుంబంలోనే ప్రేమానురాగాలు

ప్రజాశక్తి – కాకినాడ రూరల్

ప్రతి ఒక్కరు జీవితంలో ఎన్నో సుఖాలను అనుభవించినా, తనివి తీరని ఆనందాలను పొందినా ఉమ్మడి కుటుంబాల నుంచి పొందే మధురానుభూతి ప్రత్యేకమైనదని గ్రంథాలయ విశ్రాంతి అధికారి చింత పల్లి సుబ్బారావు అన్నారు. బుధవారం ఎపిఐఐసి కాలనీ లో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉమ్మడి కుటుంబం దినోత్సవం పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబాలు సిరిసంపదలు నిలయాలుగా, కష్టసుఖాలను సమానంగా పంచుకునే ఆత్మీయ అనురాగాలతో ఉండేవని అన్నారు. ఆపదలో ఆదుకునే బంధుమిత్రులతో ఒంటరితనానికి చోటు ఉండేది కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, గల్లా సుబ్బారావు, రాజా పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి
సిపిఎం, సిపిఐ, సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-యంత్రాంగం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామం వద్ద ఆర్.పిరోడ్డుపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి సిపిఎం,సిపిఐ, సిఐటియు నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అమలాపురం ఊడిమూడి వద్ద రహదారి పక్కన జట్టు కూలీలు ట్రాక్టరు పై ధాన్యం లోడు ఎగుమతి చేస్తుండగా రాజోలు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు అదుపుతప్పి ట్రాక్టరు వైపుకు దూసుకు పోవడంతో ముగ్గురు జట్టు కూలీలు అక్కడికక్కడే మతి చెందారు. ఒకరిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి తరలించించారు. ఒకరు కిమ్స్ హాస్పిటల్లో వైద్యం పొందుతున్నారు.మతులు నూకాల పెళ్ళి శివ (35), వానంశెట్టి సూర్య ప్రకాష్ (50), వీరి కళ్యాణ్ (45), చిలకలపూడి పవ బాబు (27)ల కుటుంబాలను ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. తోటి కూలీలైన చిలకలపూడి సురేష్, బొరుసు నాని పరిస్థితి విషమంగా ఉండటంతో వీరిని ఆసుపత్రికి వీరికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. బుధవారం సిపిఎం, సిపిఐ, సిఐటియు, బందం కిమ్స్ ఆస్పత్రిలో క్షతగాత్రుడిని పరామర్శించారు.అనంతరం జిల్లా ఆర్‌ఓని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరణించిన కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.సత్తి బాబు, సిఐటియు జిల్లా కన్వీనర్ నూకల బలరాం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదానికి ఆర్‌టిసి యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. కాలం చెల్లిన బస్సులను నేటికీ ఆర్‌టిసి నడుపుతోందని దీంతో నిత్యం ప్రజలు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన వాపోయారు. మతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పి.గన్నవరం నుంచి రావులపాలెం వెళ్లే రోడ్డు నిర్మాణంలో కూడా లోపాలు ఉన్నాయని రాత్రి పూట ప్రయాణం చేసే ప్రయాణికులకు రేడియంస్ స్టిక్కర్లు (టీకటిలో కనబడే ఇండికేటర్లు) సక్రమంగా నిర్మాణం లేకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ పైన కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రోడ్ కాంట్రాక్టర్ నుండి బాధిత కుటుంబాలకు కాంపెన్సేషన్ ఇప్పించాలని డిమాండ్ చేశారు. **కొత్తపేట :** యాక్సిడెంట్లు చనిపోయిన కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం డిమాండ్ చేశారు. పి గన్నవరం మండలం ఊడిమూడి వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన ఆర్‌టిసి బస్సు ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలను కొత్తపేట ఏరియా హాస్పిటల్ వద్ద బుధవారం ఉదయం కలసి సిఐటియు తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, చనిపోయిన వారికి ఒక్కొక్కరికీ రూ.50 లక్షలు చొప్పున, హాస్పటల్ లో ఉన్న క్షతగాత్రులకు రూ.25 లక్షల చొప్పున వైద్య పరిహారం ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకోవాలని సిఐటియు డిమాండ్ చేస్తోందన్నారు. ఆర్‌టిసి యాజమాన్యం నిర్లక్ష్యం వలన ఈ ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయన్నారు. ఎన్ని ప్రమాదాలు జరిగినా యాజమాన్యం తనకు పట్టనట్లుగా వ్యవహరిస్తుందని అన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులను, స్క్రాప్ కి వచ్చిన బస్సుల ను కూడా రోడ్ల మీద తిప్పుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని అన్నారు. ఈ బస్సులు నడవటానికి డ్రైవర్, కండక్టర్లు చెప్పినప్పటికీ వారి మాటలను పెడచెవిన పెట్టి వారిని బెదిరించి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఇది ప్రమాదం అనుకోకుని ఆర్‌టిసియాజమాన్యం చేసిన హత్యలుగానే దీన్ని పరిగణిస్తామని అన్నారు. ఆర్‌టిసి యాజమాన్యాన్ని శిక్షించాలని, చనిపోయిన వారి కుటుంబానికి వారి కుటుంబంలో ఒకరికి ఆర్‌టిసిలోఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లోడింగ్ అన్‌లోడింగ్ చేసే కార్మికులను ప్రభుత్వం గుర్తించాలని వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం సిఐటియు నాయకులు భాస్కరరావు, ఎంపిటిసి సభ్యుడు మోషే, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **కొత్తపేట:**పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామం లో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను కూటమి బలపరిచిన మలాపురం పార్లమెంట్ నియోజకవర్గం టిడిపి అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ పరామర్శించారు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి కి విచ్చేసి శవ పంచనామా వద్ద ఉన్న మతదేహాలను పరిశీలించి వారికి నివాళులు అర్పించారు. అక్కడ ఉన్నటువంటి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇటువంటి సంఘటనలు చాలా దురదృష్టకరమని మనసును కలిచి వేస్తాయని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారితో పాటు పి.గన్నవరం నియోజకవర్గ టిడిపి కోఆర్డినేటర్ నామన రాంబాబు టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు డొక్కా నాథ్‌బాబు ఉన్నారు. నామన ఫౌండేషన్ ద్వారా నామన రాంబాబు బాధిత నాలుగు కుటుంబాలకు వారికి తక్షణ సహాయం కింద రూ.20 వేలు గంటి హరీష్ మాథూర్ చేతులు మీదుగా అందించారు. టిడిపి నాయకులు తోలేటి సత్తిబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి భాస్కరరావు, గుబ్బల మూర్తి, సంసాని పెద్దరాజు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు శిరిగనీడి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అసలే ఇరుకు రోడ్డు.. ఆపై దురాక్రమణ..

ప్రజాశక్తి-కడియం

మండలంలోని జేగురుపాడు నుంచి మాధవరాయుడుపాలెం వెళ్లే ఆర్ అండ్ బి రహదారి ఆక్రమణలతో కుంంచించుకుపోతోంది. అసలే సింగిల్ రోడ్డు (తక్కువ వెడల్పు) కావడం, రోడ్డు పలుచోట్ల పాడవ్వడంతో రాకపోకలు కొనసాగించే ప్రజలు నానా ఇబ్బందులూ పడుతున్నారు. ఇక మొక్కల లోడులతో భారీ వాహనాలు తిరిగినప్పుడు ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. ఇదే రోడ్డులో ఒక రైతు తన పశువుల శాల చెంతన రోడ్డును ఆనుకొని దడి నిర్మించగా, మరోవైపు తన పశువుల పెంట కుప్పగా వేసి, రోడ్డు ఆక్రమణకు పాల్పడ్డాడు. దీంతో రాకపోకలు కొనసాగించే ప్రజలు, వాహనదారులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

సమ్మర్ క్యాంపులో కర్ర సాము శిక్షణ

ప్రజాశక్తి – పెద్దాపురం

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు 9వ రోజు బుధవారం బాలలు ఉత్సాహంగా శిక్షణా తరగతులలో పాల్గొన్నారు. కర్ర సాము మాస్టర్ నీలపాల కృష్ణ ఆధ్వర్యంలో బాలలకు కర్ర సాములో ప్రాథమిక మెలకువలు నేర్పారు. అలాగే ఫన్ మ్యాథ్స్‌లో జెవివి.వర్మ, క్రాఫ్ట్‌లో అన్నపూర్ణ, రేవతి లు శిక్షణ ఇచ్చారు. రొంగల పూజిత ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం బాలలకు కరాటేలో శిక్షణ ఇస్తున్నారు. చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్‌ల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో దారపురెడ్డి కృష్ణ, అమృత, సిరిజ, మంజుల, సత్య, సాయి, అభిరామ్, మణికంఠ, పవన్, వివేక్, బంగారం, నేహాలక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కర్ర సాములో శిక్షణ తీసుకుంటున్న బాలికలు

పిల్లి దంపతులకు పంతం కృతజ్ఞతలు

పిల్లి దంపతులను సత్కరిస్తున్న పంతం నానాజీ

ప్రజాశక్తి – కరప

ఇటీవల జరిగిన ఎన్నికలో కాకినాడ రూరల్ నియోజకవర్గ జనసేన అభ్యర్థి పంతం నానాజీ మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి, పిల్లి సత్తిబాబు దంపతులను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకూ సంపూర్ణంగా మద్దతుగా నిలిచినందుకు ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కుళాయిల్లో పసరు రంగు నీరు

ప్రజాశక్తి – సామర్లకోట

సామర్లకోట పట్టణ పరిధిలోని మున్సిపల్ కులాల్లో బుధవారం తాగునీరు ఆకుపచ్చ రంగులో ఉండడంతో ప్రజలు ఇక్కట్లు గురయ్యారు. సామర్లకోట మండలము ఉండూరు రోడ్డులోని నాగార్జున ఎరువుల కర్మాగారంకు చెందిన వేసవి జలాశయంకు చెందిన ఫిల్టర్ బెడ్ నుంచి గోదావరి జలాలు శుద్ధి చేసి పైప్ లైన్లు ద్వారా సామర్లకోట గణపతి నగరం, కొట్లమ్మ చెరువు గట్టు వద్ద నిర్మించిన నాలుగు భారీ రిజర్వాయర్‌ల ద్వారా సామర్లకోట పట్టణ ప్రజలకు నిత్యం మున్సిపాలిటీ తాగునీరు సరఫరా చేస్తుంది. అయితే ఫిల్టర్ బెడ్ వద్ద గోదావరి జలాలను శుభ్రపరిచే క్రమంలో క్లోరిన్, ఆలంను సక్రమంగా కలపక పోవడం వల్ల సుద్ద నీరు సరఫరా అవుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం పూర్తిగా ఫిల్టర్ బెడ్, తాగు నీరు సరఫరాను అస్సలు పట్టించు కోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఇటీవల ఫిల్టర్ బెడ్‌కు చేపట్టిన మరమత్తులు వృధా అయినట్లు భావిస్తున్నారు. పసరురంగు నీరు తాగడం వల్ల వాంతులు విరోచనాలు వంటి సమస్యలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో పరిశుభ్రమైన తాగునీటిని ప్రజలకు సరఫరా చేసి ఆరోగ్య రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ రామారావు వివరణ ఇస్తూ... ఫిల్టర్ ప్లాంట్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నీటి సరఫరాలో సమస్యలు వస్తున్నాయని, కాకినాడ పబ్లిక్ హెల్త్ డిఇ హుస్సేన్‌కు సమాచారం ఇచ్చామని, పరిశీలించి పూర్తిస్థాయిలో రక్షిత జలాలు సరఫరా చేసేలా చర్యలు చేపడతామని చెప్పారు.



బస్‌స్టాప్‌లో అపారిశుధ్యం

-ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
-పట్టించుకోని ఆర్‌టిసి అధికారులు

ప్రజాశక్తి – కోటనందూరు

ప్రయాణికులపై ప్రభుత్వం భారాలు వేసేందుకు చూపే శ్రద్ధ అదే ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం ఆ శ్రద్ధ చూపడం లేదు. తుని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఏర్పాటు చేసిన ఆర్‌టిసి బస్‌స్టాప్ వద్ద కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నర్సీపట్నం, తుని డిపోలకు చెందిన ఆర్‌టిసి బస్సులు ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు చెందిన పాయకరావుపేట, తుని, కోటనందూరు, నర్సీపట్నం, నాతవరం, మండలాలకు చెందిన సుమారు 18 గ్రామాల ప్రజలు తమ రాకపోకలను ఇదే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఏర్పాటు చేసిన బస్‌స్టాప్ నుంచి సాగిస్తారు. ప్రయాణికులు కూర్చోడానికి కనీసం కుర్చీలు, నిలబడడానికి నీడ లేకపోవడంతో ఎండకు ఎండి, వర్షానికి తడుస్తూ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వర్షం వస్తే ఈ వర్షపు నీటితో నిండిపోయి బురద మయంగా మారి దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తూ ఉంటాయి. లైట్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల రాత్రుల సమయాల్లో మహిళలు ప్రయాణం చేయాలంటే భయాందోళనకు గురవుతున్నారు. తెల్లవారుజాము నుంచి రాత్రి 9:30 గంటల వరకు ఆర్‌టిసి బస్సులు రాకపోకలు సాగుతాయి. బస్‌స్టాప్ వద్ద ప్రయాణికుల కోసం షెల్టర్ నిర్మాణం చేపట్టి కుర్చీలు, విద్యుత్ లైట్లను ఏర్పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని, మహిళ ప్రయాణికులకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

అపారిశుధ్యంలోనే నిలుచున్న ప్రయాణికులు

పట్టణ ఆధిక్యతపై పందేల జోరు

ప్రజాశక్తి – ఏలేశ్వరం

శాసనసభ, పార్లమెంట్ నియోజకవర్గాల్లో, జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ఎవరు గెలుస్తారు, వారి మెజార్టీలపై కూడా పందేలు జరగడం పరిపాటి. అయితే ఏలేశ్వరంలో మాత్రం అందుకు విరుద్ధంగా పట్టణంలోని అధికంగా ఏ పార్టీ ఓట్లు సాధిస్తుంది అనేదానిపై పందాలు జోరుగా సాగుతున్నట్టు తెలుస్తుంది. దీనికి ముఖ్య కారణం నాయకులు పార్టీలు మారడమే. ముఖ్యంగా పట్టణంలో టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేసిన వారు ఎన్నికలవేళ వైసిపిలో చేరడం, కాంగ్రెస్, వైసిపిలో మాత్రమే పని చేసిన వారు టిడిపి గెలుపునకు కృషి చేయడం కారణంగా కనిపిస్తుంది. టిడిపి ఆవిర్భావం నుంచి పైన సత్యనారాయణ ఆ పార్టీలో ఉంటూ రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షులుగా, సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన వయోభారంతో ఆయన కుమారుడు పైల సుభాష్ చంద్రబోస్ పట్టణ టిడిపి పగ్గాలు భుజాన వేసుకుని స్థానిక మునిసిపల్ ఎన్నికల్లో 20 వార్డుల్లో అభ్యర్థులను నిలపడంతోపాటు నలుగురు కౌన్సిలర్లు వంటి చేతిపై గెలిపించి టిడిపికి పెద్దదిక్కుగా మారారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరుపుల రాజా మృతితో సమీకరణాలు మారుతూ వస్తున్నాయి. రెండుసార్లు వార్డు సభ్యునిగా, కాంగ్రెస్ ఎపిటిసిగా, వైసిపి వార్డు కౌన్సిలర్‌గా పనిచేసిన బొద్దిరెడ్డి గోపి ఎన్నికలకు సంవత్సరం ముందు టిడిపిలో చేరారు. మరో నెలలో ఎన్నికలు అనగా చైర్‌పర్సన్ అలమండ సత్యవతి ఆమె భర్త వార్డు కౌన్సిలర్, వైసిపి జిల్లా కార్యదర్శి నియోజకవర్గ నేతలతో ఏర్పడిన విభేదాలు కారణంగా టిడిపిలో చేరారు. ఈ నేపథ్యంలో నువ్వా నేనా అన్న రీతిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏలేశ్వరం పట్టణంలో పోలైన 18,000 పై చిలుక ఓట్లలో వైసిపికి మెజారిటీ వస్తుందని, లేదు టిడిపికి ఆధిక్యత వస్తుందని కొందరు జూదరులు జోరుగా పందాలు నిర్వహిస్తున్నారు. పందాలు కాయని వారు సైతం మెజార్టీ పైనే చర్చించుకోవడం కోస మెరుపు. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణ వ్యాప్తంగా 78 శాతం ఓట్లు నమోదు కావడంతోపాటు, నూతన ఓటర్లు, యువత, మహిళలు ఏ పార్టీ వైపు మొగ్గు చూపారు, రైతులు, సంక్షేమ ఫలాలు పొందుతున్న వారు, తటస్తులు ఏ పార్టీకి ఓటు వేశారు అనేదానిపై కూడా చర్చ సాగుతుంది. పోల్ మేనేజ్మెంట్‌లో వైసిపికి రాజీనామా చేసిన వాలంటీర్ల సహకారంతో పోలింగ్‌కు నాలుగు రోజుల ముందు నుంచే గట్టుచప్పుడు కాకుండా నగదు ముట్ట చెప్పారు. ఈ విషయంలో టిడిపి వెనుకంజలో ఉంది. ఇది కూడా వైసిపి మెజార్టీకి అనుకూల అంశంగా తెలుస్తుంది. ఏది ఏమైనా ఎవరి పంట పండుతుందో తెలుసేందుకు జూన్ 4 వరకు వేసి ఉండవలసిందే.

ఘనంగా ఆర్థోడాంటిక్ దినోత్సవం

ప్రజాశక్తి – కాకినాడ రూరల్

స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని శ్రీ సత్య దంత వైద్యశాలలో కాకినాడ ఐడిఎ సభ్యుల ఆధ్వర్యంలో ప్రపంచ ఆర్థోడాంటిక్ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐడిఎ సిడిహెచ్ కన్వీనర్ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మే 15న ఆర్థోడాంటిక్ ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటామని అన్నారు. ఆర్థోడాంటిక్స్ అనేది దంతాలు మరియు ముఖం యొక్క ఎముకల వైకల్యాల నిర్ధారణ, నివారణ మరియు చికిత్సపై దృష్టి సారించిన దంత ప్రత్యేకత అని అన్నారు. మాలోక్లూషన్స్ (మాలోసీసీలుషన్స్) లేదా రద్దీగా ఉండే దంతాలు, ఎత్తు పళ్ళు, వంకరగా ఉండే పలు వరుస ఉన్నవారు ఆర్థోడాంటిస్ట్‌ని ఖచ్చితంగా సంప్రదించాలని అన్నారు. ఎత్తు మరియు వంకర పళ్ళు ఉన్న వారికి పూర్వం క్లిప్‌లు, బ్రేసస్ వేసేవాళ్ళమని, ఈ తరహా వైద్య విధానంలో ఆహారం తీసుకునేటప్పుడు కొంచం ఇబ్బంది ఉంటుందన్నారు. ప్రస్తుతం క్లియర్ ఎలైనర్స్ (క్లియర్ అలైనర్స్) వైద్యవిధానం ద్వారా అత్యంత సుఖమైన, నొప్పిలేని వైద్యాన్ని అందచేస్తున్నామని అన్నారు. కాకినాడ ఐడిఎ సిడిహెచ్ కన్వీనర్, ఆర్థోడాంటిస్ట్ డాక్టర్ స్వరూప్ మాట్లాడుతూ మన ముఖంలో ఎత్తు మరియు వంకర పలు వరుస వలన సౌందర్యపరంగా సమస్యల వలన మన ఆత్మవిశ్వాసాన్ని ప్రభావితం చేస్తాయని, చిరునవ్వు మరియు జీవితాన్ని పూర్తిగా ఆనందించే సామర్థ్యాన్ని ఆర్థోడాంటిస్ట్ ద్వారా ఆ సమస్యలను పరిష్కరించవచ్చని అన్నారు. ఈ సదస్సులో ఆర్థోడాంటిక్ దంత వైద్య రంగం లో వచ్చిన ఆధునిక సాంకేతిక పరికరాలను ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో కాకినాడ ఐడిఎ అధ్యక్షులు డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ సిరాజ్, భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

అతిథికి గిఫ్ట్‌ను అందిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

అల్లూరి పార్కు వద్ద పేరుకుపోయిన చెత్త

సామర్లకోటలో అపారిశుధ్యం

ప్రజాశక్తి – సామర్లకోట

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో పలు కూడలి ప్రాంతాల్లో పెద్దఎత్తున చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దానితో దోమలు విపరీతమై ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. ప్రధానంగా పట్టణ పరిధిలోని దళిత కాలనీలైన బ్రౌన్ పేట్ వద్ద అంబేద్కర్ పార్క్, బలుసుల పేట అల్లూరి సీతారామరాజు పార్క్ వద్ద, మరికొన్ని కాలనీల్లో చెత్త సమస్య విపరీతమావుతోంది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు కుప్పలుగా ఉండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. గత నాలుగు రోజులగా పలు వార్డుల్లో పారిశుధ్య సిబ్బంది చెత్తను తరలించకపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఈ కారణంగా దోమలు విపరీతంగా పెరిగి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు తక్షణం స్పందించి పట్టణ ప్రజలు అనారోగ్యాల బారిన పడకముందే పారిశుధ్య పనులు చక్కదిద్దాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఐసిటిసి సెంటర్‌లోనే మందుల పంపిణీ

ప్రజాశక్తి – పెద్దాపురం

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఐసిటిసి సెంటర్ లో పాజిటివ్ వచ్చిన రోగులకు ఇక్కడే మందులు పంపిణీ జరుగుతుందని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టిబి ఆఫీసర్ డాక్టర్ సురేష్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఆసుపత్రి సిబ్బందికి, ఎఆర్‌టి సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు స్థానిక ఐసిటిసి సెంటర్లో పాజిటివ్ వచ్చిన రోగులకు మందుల పంపిణీ కాకినాడ ఎఆర్‌టిలో జరిగేదన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఈ మందుల పంపిణీ పెద్దాపురం ఐసిటిసి సెంటర్‌లోనే జరపాలకి నిర్ణయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యకుమారి, రత్నరాజు, విజయశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న డాక్టర్ సురేష్ రెడ్డి

పాస్‌పోర్టు పోయినది

సూరాడ వెంకట సాయి కిషోర్ అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం వారు **W0505756** గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. ది. 29-4-2024వ తేదీన ఇంటి నుండి ధవళేశ్వరం బస్టాండ్‌కు వెళ్తున్న దారిలో ప్రయాణంలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది చిరునామాకు అందజేయాలని కోరుచున్నాను.

సూరాడ వెంకట సాయి కిషోర్
డోర్ నెంబర్: 3-286, కృష్ణ టెంపుల్ స్ట్రీట్
ధవళేశ్వరం గ్రామం, రాజమహేంద్రవరం రూరల్
తూర్పుగోదావరి జిల్లా - 533125
సెల్: 9515929779

స్మార్ట్ సిటీకి పచ్చదనం కరువు

ప్రజాశక్తి – కాకినాడ రూరల్

స్మార్ట్ సిటీ కాకినాడ నగరంలో పచ్చదనం కరువయ్యిందని పట్టణ పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రూ.300 కోట్ల బడ్జెట్‌తో 5 లక్షల జనాభా కలిగిన స్మార్ట్ సిటీ మున్సిపల్ కార్పోరేషన్ పచ్చదనం కోసం కనీసంగా 2 శాతం నిధులు కూడా ఖర్చు చేయడం లేదన్నారు. తూర్పు బీచ్ రోడ్ నుంచి పడమర సామర్లకోట రోడ్ వరకూ, ఉత్తరం ఎడిబి రోడ్ నుంచి దక్షణం వైపు జగన్నాధపురం వరకు.. రోడ్ మార్జిన్లలో పచ్చదనం పూర్తిగా కరువైపోయిందని అన్నారు. ట్రాఫిక్, ఐలాండ్స్, డివైడర్లు రోడ్ సైడ్ మార్జిన్లలో ఎండి పోయిన లాన్ పిచ్చి మొక్కలు గుబురుగా పెరిగిన తుప్పలు మినహా ఆహ్లాదం అందించే పచ్చదనం ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఎడిబి సెంటర్ ఒఎన్‌జిసి ఐ లాండ్‌లో నిర్వహణ కరువయ్యి పూర్తిగా గ్రీనరీ ఎండిపోయిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, పాఠశాలలు రహదారుల్లో విషపూరిత కోనో కార్పస్ డెవిల్ ట్రీస్‌గా పిలిచే ఏడాకుల మొక్కలు భారీవృక్షాలుగా తయారయ్యి రోగ నిరోధక శక్తి తగ్గిన సీనియర్ సిటిజన్స్‌కు, చిన్నారులకు ఉబ్బసం, శ్వాసకోస చర్మ వ్యాధులతో అనారోగ్యాలు కలిగిస్తున్న దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం నగర వ్యాప్తంగా ఉన్న విషవృక్షాలను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

IN THE COURT OF II ADDITIONAL DISTRICT JUDGE, AMALAPURAM
I.A. No. 235 of 2022 in O.S. No. 13 of 2016

Between:
D.S.M.V.A.Prakash
...Petitioner/ Plaintiff
AND
K.Satyanarayana Raju and 6 others
...Respondents/ Defendants

Respondent/ Defendant No-7:
Mullapudi Radha,
W/o. Bhaskara Rao, Hindu, aged 45 years, D.No. 1-181, Vaddiparru Village, Atreyapuram Mandal, Dr. B.R.Ambedkar Konaseema District.

Please take notice inspite of taking summons, you evaded to receive the same in the above matter. The matter is posted to **24-06-2024** for your appearance. If you fail to appear in person or through your advocate before the Hon'ble Court, you will be set exparte.

S.KUMAR
Advocate, Rajahmundry

ప్రకటన
మహారాజశ్రీ తణుకు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
H.M.O.P. No. 135/2023

Between:
పిటీషనర్: తిరుమళ్ళ లక్ష్మికుమారి
మరియు
రెస్పాండెంట్: తిరుమళ్ళ రంజిత్‌కుమార్

రెస్పాండెంట్: తిరుమళ్ళ రంజిత్‌కుమార్, S/o. గౌతు మునేశ్వరరావు, డో.నెం. 1-34, అట్లపాడు, నిడదవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు పిటీషను నందు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ అమలు జరగని కారణముగా Substitute of Service ద్వారా నోటీసులు అమలు నిమిత్తము ది. **24-06-2024 సం॥రం తేదీనకు వాయిదా వేసినారు. ఆరోజు ఉదయము గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(By Order)
కొండూరి అనంత పద్మనాభం
ఇందుకూరి వెంకట నరసింహరాజు
కొండూరి రవళి
పిటీషనరు తరపు న్యాయవాదులు
ది.15-5-2024 తణుకు, సెల్: 9948193227

ఆధునిక జీవనశైలితో రక్తపోటు

ప్రజాశక్తి – కాకినాడ రూరల్

మారిన జీవనశైలి కారణంగా అధిక శాతం మంది అధిక రక్తపోటుకు గురవుతున్నారని, దీని నిర్లక్ష్యం చేస్తే శరీరంలో ప్రధాన అవయవాలు దెబ్బ తినే అవకాశం ఉందని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. బుధవారం బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తనాళాల ద్వారా రక్తప్రసరణ పరిమాణం పెరగడంతో ధమని గోడలపై ఒత్తిడి బాగా అధికమై రక్తపోటు పెరుగుతుందన్నారు. అధిక రక్త పీడనం వలన గుండెపై భారం పెరగడంతోపాటు మెదడులోని రక్తనాళాలు సున్నితత్వాన్ని కోల్పోతాయని అన్నారు. దీని నివారణకు గాను ఉప్పును పరిమితంగా వాడాలన్నారు. ధూమపానం తగదని, ఎత్తుకు తగ్గ బరువు ఉండాలన్నారు. కూరగాయలు, పండ్లను అధికంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బొండా సూర్యారావు, డాక్టర్ కె.వెంకటరమణ, అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీ నగేష్ పాల్గొన్నారు.